భారత్ సమాచార్.నెట్
BHARATH SAMACHAR DIGITAL

27, అక్టోబర్ 2026, మంగళవారం భారత్ సమాచార్

SIRపై కాంగ్రెస్ రాద్ధాంతం మానుకోవాలి: రాగి రాములు





భారత్ సమాచార్, మెదక్ జిల్లా: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ (SIR)పై కాంగ్రెస్ పార్టీ, దాని మిత్రపక్షాలు చేస్తున్న ఆరోపణలు, విమర్శలకు స్వస్తి పలకాలని BJP SIR జిల్లా కన్వీనర్ రాగి రాములు డిమాండ్ చేశారు. అర్హులైన ఓటర్లకు అన్యాయం జరుగుతోందంటూ ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదని, రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో అనవసరమైన భయాందోళనలు సృష్టించకూడదని తెలిపారు. మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో మీడియాతో మాట్లాడుతూ అయన ఈ వ్యాఖ్యలు చేశారు.

SIR ప్రక్రియను అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ పార్టీ చిల్లర రాజకీయాలకు పాల్పడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని రాగి రాములు విమర్శించారు. ఓటర్ల జాబితాలో మార్పుల పేరుతో అర్హుల ఓట్లు తొలగిస్తున్నారంటూ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను వాస్తవాలతో నిరూపించాలని సవాల్ విసిరారు. ప్రజల్లో అపోహలు కల్పించడం కంటే, ఏవైనా తప్పులు ఉంటే వాటిని ఆధారాలతో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

ఓటర్ల జాబితాలో పారదర్శకతను పెంచడం SIR ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని అయన పేర్కొన్నారు. మరణించిన వ్యక్తుల పేర్లను జాబితా నుంచి తొలగించడం, ఒకే వ్యక్తి పేరు వేర్వేరు ప్రాంతాల్లో నమోదై ఉంటే వాటిని గుర్తించడం, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నమోదులను సరిచేయడం వంటి అంశాలపై ఈ ప్రక్రియలో దృష్టి సారిస్తారని వివరించారు.

అదే సమయంలో అర్హులైన ఒక్క ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోకుండా చూడటం అత్యంత ముఖ్యమని రాగి రాములు స్పష్టం చేశారు. అర్హులైన ఓటర్ల పేర్లు ఎక్కడైనా తొలగించబడి ఉంటే, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి నిబంధనల ప్రకారం సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ఆరోపణలు చేయడం మాత్రమే కాకుండా, సమస్యను నిరూపించే ఆధారాలను చూపించాలని అన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ఓటర్ల జాబితా ప్రక్షాళనను రాజకీయ వివాదంగా మార్చడం తగదని రాగి రాములు తెలిపారు. రాజకీయ లబ్ధి కోసం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ

విడనాడాలని డిమాండ్ చేశారు. SIR ప్రక్రియపై ప్రజలకు వాస్తవాలను వివరించాలని, అర్హులైన ప్రతి ఓటరు హక్కును కాపాడే అంశానికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.

© 2026 Bharath Samachar